క్లుప్తంగా

నేడు హనుమాన్ శోభాయాత్ర

కడప కల్చరల్ : స్థానిక హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. అందులో భాగంగా మధ్యాహ్నం 3.00 గంటలకు మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం వద్దనుంచి హిందువుల బైక్ ర్యాలీ ప్రారంభం కానుంది. అక్కడ బయలుదేరే ర్యాలీ అప్సర సర్కిల్, కొత్త బస్టాండు, మహావీర్ సర్కిల్, ఎర్రముక్కపల్లె, కోటిరెడ్డిసర్కిల్, ఏడురోడ్ల మీదుగా పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరనుంది.

కోట గంగమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో కోట గంగమ్మ

కమలాపురం : స్థానిక కోట వీధిలో వెలసిన శ్రీ కోట గంగమ్మ 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కోట గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, సామూహిక కంకు మార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. కాగా నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్రస్థాయి నాయకత్వ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. రాష్ట్ర స్థాయి న్యాయకత్వ శిక్షణా తరగతులకు సంబంధించిన పోస్టర్స్‌ను శనివారం బ్రహ్మంగారి మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి కడపలోని తన స్వగృహంలో ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. మే నెల 24, 27 తేదీలలో కడప నగరంలో జరిగే ఈ రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని అన్నారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా


పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సఖి ఫౌండేషన్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ తోఫా కింద నిత్యావసర సరుకులు అందజేశారు. శనివారం కడప నగరంలోని సంస్థ కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు గౌస్‌పీర్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ పేదలు రంజాన్ మాసాన్ని సంతోషదాయకంగా నిర్వహించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సఖి ఫౌండేషన్ ప్రతినిధులు రహమతున్నీసా, నుస్రత్, ఫాతిమా, గీత తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి


మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : హత్యకు గురైన వైఎస్సార్ సీపీ నాయకుడు శంకర్ రెడ్డి అంత్య క్రియలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం హత్యకు గురైన శంకర్ రెడ్డి మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మధ్యాహ్నం కమలాపురంలో శంకర్‌రెడ్డి మృతదేహంపై పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మీకు అన్ని విధాలా అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

'మానవత'బోర్డు ఆవిష్కరణ

కడప కల్చరల్ / కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని శాటిలైట్ సిటీ వద్ద శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆహ్వాన బోర్డును సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తున్న మానవత సంస్థకు సంబంధించిన వివరాలతో ఈ బోర్డును ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అవకాశం గల వారందరూ సమాజ సేవ కోసం కృషి చేయాలని కోరారు. మానవత సంస్థ సభ్యులు కల్లూరు బాల యల్లారెడ్డి ఈ బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన

కడప కార్పొరేషన్ : నగరంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం విస్తృతంగా సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళుతున్న కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు ప్రోత్సాహమిస్తున్నారు. కడప నగరంలోని 20వ డివిజన్ మారుతీనగర్, ఏపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డిలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి, వారి మొబైల్స్‌కు, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. వారి మొబైల్ నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు.

■ అక్కాయపల్లె పరిధిలోని 47వ డివిజన్‌లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు, కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సర్వేలో భాగంగా రూపొందించిన ప్రశ్నలను ప్రజలను అడిగి వారి సమాధానాలు నోట్ చేసుకొని వారికి స్లిప్ ఇచ్చారు. సర్వే చేసిన ప్రతిచోటా జగనన్నే మళ్లీ సీఎం కావాలని ప్రజలు నినదించారు.

■ కడప నగరం 30వ డివిజన్‌లోని నాగరాజుపేటలో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇళ్ల వద్దకు వెవెళ్లి ఈ ప్రభుత్వం చేపట్టిన


20వ డివిజన్‌లో పథకాలు వివరిస్తున్న కార్పొరేటర్ వై. మాధవి


47వ డివిజన్‌లో సర్వే చేపడుతున్న కార్పొరేటర్ పాకా సురేష్


30వ డివిజన్‌లో స్టిక్కర్ అందజేస్తున్న కార్పొరేటర్ షఫీ

అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గూర్చి వివరించారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

వల్లూరు: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మైసూరారెడ్డి కాలనీ, లేబాక, దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురం వీవర్స్ కాలనీ తదితర గ్రామాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకట సుబ్బయ్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ ఇందిరెడ్డి శంకర్‌రెడ్డిలు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో తిరిగి స్థానిక నేతల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించి ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం వారి అనుమతితో గృహాల తలుపులకు స్టిక్కర్లను అతికించారు. మండల కన్వీనర్ వీరారెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ సీఎం జగన్ మోహన్ రెడ్డి సుపరిపాలనతో అందరి మన్ననలను పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరి కేశవ రెడ్డి, పార్టీ నేతలు రామ క్రిష్ణా రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చెన్నూరు : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వారు కొత్త గాంధీనగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని తెలియజేశారు. అలాగే వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు ఆధ్వర్యంలో రాచినాయపల్లె, సర్పంచ్ సొంతం సుదర్శన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్ ఆధ్వర్యంలో జగగన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పైడికాల్వ పుష్పలత, జకరయ్య, చంద్రబాబు, భాస్కర్, రత్నం, టీఎస్ చంద్రారెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి, కటారి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు


వల్లూరు: ఇంటి తలుపునకు స్టిక్కర్ అతికిస్తున్న మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల పరిణయోత్సవం


కల్యాణోత్సంలో పాల్గొన్నభక్తులు


స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం ఆకులవీధిలోని శ్రీ రామాలయంలో శనివారం శ్రీ సీతారాముల పరిణయోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అభిషేకాలు, అలంకారాల అనంతరం కొలువుదీర్చారు. అనంతరం వేద పండితుల బృందం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో కల్యాణం జరుగుతున్నంత సేపు జై శ్రీరామ్ నినాదాలు మిన్నంటాయి. మహా మంగళ సూత్రాన్ని వేద పండితులు భక్తులకు దర్శింపజేసి స్వామి పక్షాన అమ్మవారి గళసీమల్లో అలంకరించారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని ఉల్లాస భరితంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహభరితంగా రన్ ఫర్ జీసెస్

కడప కల్చరల్ : పాపుల రక్షణ కోసం శిలువపై ప్రాణ త్యాగం చేసి త్యాగానికి మారుపేరుగా నిలిచిన దైవ కుమారుడు క్రీస్తు మహిమను ఘనపరిచేందుకు అంతా కలిసికట్టుగా ఆయన చూపిన బాటలో పయనిద్దామని సీఎస్ఐ డయాసిస్ పీఠాధిపతి రైట్ రెవరెండ్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ పిలుపునిచ్చారు. గుడ్‌ఫ్రైడే కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు శనివారం ఉదయం కడప నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ విచారణ గురువులు పాస్టర్ మత్తయ్యబాబు విశ్వాసులతో కలిసి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఆకుపచ్చ జెండా ఊపి ప్రారంభించారు. తెల్లని టీ షర్టులు, టోపీలతో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్న ఈ రన్‌లో అడుగడుగునా రన్ ఫర్ జీసెస్ అంటూ నినాదాలు చేస్తూ తమ పరుగుతో నగరమంతటా సందడి చేశారు. చర్చి వద్ద ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్లు, గోకుల్ సర్కిల్, కృష్ణా సర్కిల్, అప్సర సర్కిల్, ఆర్టీసీ బస్టాండుల మీదుగా తిరిగి చర్చికి చేరింది. రాత్రి దాదాపు అన్ని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


రన్ ఫర్ జీసెస్ ర్యాలీలో సీఎస్ఐ దయాసిస్ పీఠాధిపతి రైట్ రెవరెండ్ బిషప్ ఐజాక్ వరప్రసాద్

శనివారానికి 40 రోజుల లెంట్ డేస్ (శోక దినాలు) పూర్తి కావడంతో ఆదివారం ఈస్టర్ సండేని ఘనంగా నిర్వహించేందుకు చర్చి కమిటీ సభ్యులు, గురువులు సిద్ధమయ్యారు. ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం తెల్లవారుజామున 5 నుంచి 7 గంటల్లోగా ప్రార్థనలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి మనోహర్ బాబు, మాజీ కార్యదర్శి డేనియల్, స్త్రీల మైత్రి, యవ్వనస్తుల సంఘం, సండేస్కూలు బాలలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఉలేమా అయిమ్మ' ఇఫ్తార్

కడప కల్చరల్ : స్థానిక రహమతుల్లావీధిలోని ఉలేమా అయిమ్మ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం భక్తులకు ఇఫ్తార్ నిర్వహించారు. దావతె ఇఫ్తార్ పేరిట ఈ కార్యక్రమాన్ని ఆ కమిటీ అధ్యక్షులు మౌలాన సయ్యద్ నిజాముద్దీన్ బుఖారి, కార్యదర్శి ముఫ్తీ సయ్యద్ సలీం బుఖారిల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష ఉలేమా అయిమ్మ కమిటీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసులకు ఇఫ్తార్ ఇవ్వడం పుణ్యదాయకమన్నారు. కమిటీ సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ మగ్దూం బుఖారి సాహెబ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు, మత గురువులు, రాజకీయ ప్రముఖులు శ్రీనివాస రెడ్డి, అమీర్‌బాబు, ఉలేమాలు, మౌల్వీలు, ముఫ్తీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, ముస్లిం ప్రముఖులు

కేఎస్ఆర్ఎం ట్రోఫీ –2కే23 ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కందుల శివానందరెడ్డి 74వ జయంతి సందర్భంగా కడప శివార్లలోని కేఎస్ఆర్ఎం కళాశాల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రోఫీ–2కే23ని ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ వరకు జరిగే వివిధ క్రీడాపోటీల్లో రాయలసీమలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి క్రీడాకారులు తలపడనున్నట్లు తెలిపారు.

ఈ నెల 15వ తేదీన తన తండ్రి 74వ జయంతి సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, స్పోర్ట్స్ క్లబ్ సమన్వయకర్త వంశీనాయక్, పీడీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


కందుల శివానందరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబులరెడ్డి

సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

మదనపల్లె సిటీ: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సకాలంలో పంపిణీ చేయనున్నట్లు మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా పదో తరగతి పరీక్షలు, జగనన్న విద్యాకానుక పరిశీలకులు మార్తల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులతో జగనన్న విద్యాకానుక పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే వారం జిల్లాకు జగనన్న విద్యాకానుక కిట్లు వస్తాయన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గో విడత కిట్లలో 9 రకాల వస్తువులను 1–10 తరగతుల విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందు కోసం జిల్లాలోని 30 మండలాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నమోదు చేసిన విద్యార్థుల సైజుల ప్రకారం యూనిఫారం, షూలు ఇవ్వాలన్నారు. కిట్ల పంపిణీకి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎంఈఓ, హెచ్‌ఎం, మండల ఇంజనీర్, ఎపిఎంలు ఉంటారన్నారు. కిట్లు స్టాకు పాయింట్లులో పెట్టి మండల పరిధిలోని పాఠశాలలకు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం రెడ్డన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల గదులను పరిశీలించారు.


మాట్లాడుతున్న మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్ మార్తల వెంకటకృష్ణారెడ్డి

విద్యాకానుక కిట్లు భద్రంగా ఉంచాలి

గుర్రంకొండ : ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యాకానుక కిట్లు భద్రంగా ఉంచాలని రాష్ట్ర జగనన్న విద్యాకానుక సర్వీసెస్ జేడీ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం గుర్రంకొండలోని తెలుగు జెడ్పీహైస్కూల్ భవనాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసే జగనన్న విద్యాకానుక కిట్ల వారం రోజుల్లో మండలకేంద్రాలకు సరఫరా అవుతాయన్నారు. వీటిని మంచి రక్షణ ఉన్న భవనాల్లో భద్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షానికి తడవకుండా, కిటికీలు, తలుపులు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండే భవనాల్లోనే ఉంచాలన్నారు. ఈవిషయమై మండల విద్యాశాఖ అధికారులు చొరవ చూపాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంవో కరుణాకర్, ఎంఈఓ సురేంద్రబాబు, హెడ్మాస్టర్ మదన్‌మోహన్, డేటా ఆపరేటర్ సిద్దేశ్వర్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్ : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (30 రోజులు), జ్యూట్ బ్యాగ్స్ తయారీ (13రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు వయసు కలిగిన గ్రామీణ ప్రాంత మహిళలు ఈ కోర్సులకు అర్హులన్నారు. ఈనెల 19వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుందన్నారు. వివరాలకు 9440905478, 6302833548 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

సాయిపేటలో చోరీ

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయిపేటలో నివాసం వుంటున్న షేక్ చాంద్‌బాషా ఇంటిలో చోరీ జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. షేక్ చాంద్ బాషా తన కుటుంబసభ్యులతో ఈనెల 7వ తేదీన రాత్రి కమలాపురంలో ఉరుసుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు వచ్చాడు. ఆ మధ్య సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి కిటికీ పైకి ఎక్కి, ఆపైన వున్న రేకులను వంచి లోపలికి వెళ్లారు. బీరువాను పగులగొట్టి అందులోని రెండు తులాల నెక్లెస్, ఇతర ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలియజేశారు.

నేడు బండలాగుడు పోటీలు

కమలాపురం : ఎర్రగుడిపాడులో వెలసిన శ్రీ అంకాల పరమేశ్వరీ అమ్మవారి 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం భారతి సిమెంట్ సౌజన్యంతో సర్పంచ్ ఎస్. వెంకట లక్షుమ్మ, మండల వైస్ ప్రెసిడెంట్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇప్పటికే పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.12వేలు, రూ.8వేలు, రూ.4వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలని జిల్లా పెన్షనర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి అన్నారు. రాయల్ రషీద్ సంస్థ ముద్రించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను శనివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామూర్తినాయుడు, ట్రెజరర్ నగేష్, ఆర్ఆర్ సంస్థ ప్రతినిధి అబ్దుల్ రాయల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో ఆరోగ్యం పదిలం

వల్లూరు : వ్యాధి నిరోధక టీకాల వలన వ్యాధుల నుంచి రక్షణ పొందడం ద్వారా ఆరోగ్యం పదిలంగా వుంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పలు టీకా కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు మధ్యాహ్న భోజన సమయంలో ఐరన్ మాత్రలను తినిపించాలని సూచించారు. టీకాలను నిర్ణీత సమయాల్లో ఖచ్చితంగా వేయడానికి చర్యలు చేపట్టాలని ఆశా, వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఇమ్యూనైజేషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు అందించారు. పాపాగ్ని నగర్‌లో బరువు తక్కువగా వున్న 10 నెలల పసి బిడ్డను గుర్తించి రిమ్స్‌లోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, హెల్త్ సూపర్ వైజర్ శివరామిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి డాక్టర్ మల్లేశ్వరి

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

వైవీయూ : విద్యార్థులు చదవడంతో పాటు ఎంట్రప్రెన్యూర్‌లుగా మారి ఉద్యోగాలు కల్పించేస్థాయికి రావాలని కెనరాబ్యాంకు కడప చీఫ్ మేనేజర్ పి.వి. కృష్ణప్రసాద్ సూచించారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం ఆధ్వర్యంలో 60 రోజుల పాటు పుట్టగొడుగుల పెంపకంపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ, వృక్షశాస్త్ర అధ్యాపకుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకంపై 60 రోజుల పాటు థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహించి, విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశామని తెలిపారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న కృష్ణప్రసాద్

వైభవం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. శనివారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని అకట్టుకొంది.

ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గోన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. కార్యక్రమంలో అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణ, అనిల్, రాజు, గోకుల్ స్వాములు పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రంలో త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్ష మూల్యాంకన కేంద్రంలో టీచర్లకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 సంవత్సరాలు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వారిని మూల్యాంకన విధులనుంచి మినహాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, గురవయ్య, సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.